క్లుప్తంగా

పిల్లలకు విధిగా ఆధార్

పామూరు: తల్లిదండ్రులు విధిగా పిల్లలకు ఆధార్ నమోదుచేయించుకోవాలని ఐసీడీఎస్ సీడీపీఓ పి.సరోజిని అన్నారు. మండలంలోని బలిజపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం సెక్టార్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సీడీపీఓ సరోజిని మాట్లాడుతూ బిడ్డ పుట్టిన 21 రోజుల్లోగా జనన ధ్రువీకరణ పత్రం పొంది ఆ తరువాత ఆధార్‌కు దరఖాస్తు చేసుకోవాలన్నారు. 3- సంవత్సరాల నుంచి 6 ఏళ్ల పిల్లలను అంగన్‌వాడీ కేంద్రానికి పంపాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ గోళ్ల పద్మజ, సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏఐవైఎఫ్ మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

కనిగిరిరూరల్: నిరుద్యోగ యువతీ, యువకులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి పోతల ప్రభాకర్ అన్నారు. స్థానిక దరిశి చెంచయ్య భవన్‌లో మంగళవారం ఫిబ్రవరి 6 నుంచి 9 వరకు శ్రీకాకుళంలో జరిగే ఏఐవైఎఫ్ 22వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో పోతల ప్రభాకర్ మాట్లాడుతూ యువతకు నేషనల్ గ్యారంటీ స్కీం అమలు చేయాలని, నిరుద్యోగ భృతి రూ. 3 వేలు ఇవ్వాలని, ఎన్నికల హామీల ప్రకారం నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అఖిల భారత యువజన సమాఖ్య జిల్లా ఉపాధ్యక్షుడు పుట్టా సుబ్బారావు, పట్టణ నాయకులు ఎస్‌కే నజీముద్దీన్, పూర్ణచంద్ర పాల్గొన్నారు.

10 మద్యం బాటిళ్లు స్వాధీనం

హనుమంతునిపాడు: మండల కేంద్రంలో మంగళవారం మద్యం బెల్టు షాపుల పై ఒంగోలు ఎక్సైజ్ అధికారులు దాడి చేశారు. హనుమంతునిపాడు మండల కేంద్రంలో బెల్టు షాపులు నిర్వహిస్తున్న అనుమానితుల ఇళ్లలో సోదాలు నిర్వహించారు. ఈక్రమంలో ఆర్నూరి బాల ఇంట్లో 10 మద్యం బాటిళ్లు దొరికాయి. మద్యం అమ్ముతున్న నిందుతుడిని పోలీసులు కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ ఎస్సై రవి ఆంజనేయులు (ఒంగోలు), పొదిలి ఎక్సైజ్ ఎస్సై సైమన్ తెలిపారు. తనిఖీలో ఒంగోలు, పొదిలి ఎక్సైజ్ పోలీసు సిబ్బంది హరినారాయణ, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

జనవిజ్ఞాన వేదిక వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎంఈఓ శ్రీనివాసరావు

కనిగిరిరూరల్: విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం అవసరం అని ఎంఈవో రాచమడుగు శ్రీనివాసరావు పేర్కొన్నారు. స్థానిక కొత్తపేట జనవిజ్ఞాన వేదిక కార్యాలయంలో యురేకా సైన్స్ ఎక్స్‌పో పోస్టర్‌ను ఎంఈవో మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విశ్రాంత ఎంఈఓ వీ నాగిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించే విధంగా జేవీవీ చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. కార్యక్రమంలో జేవీవీ రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు మాలకొండారెడ్డి, ఎస్‌కే ఖాజా హుస్సేన్, జడ్డు రమణయ్య, జీ శ్రీనివాసరెడ్డి, ఎస్‌కే బషీరా, ఎం బ్రహ్మయ్య, ఎం కోటిరెడ్డి, ఎస్‌కే ఖాజా రహంతుల్లా పాల్గొన్నారు.

ఆరోగ్య పింఛన్ల పరిశీలన



పెన్షన్‌దారులను పరిశీలిస్తున్న వైద్యబృందం

పీసీపల్లి: మండల పరిధిలో ఉన్న ఆరోగ్య పింఛన్లను వైద్య బృందం మంగళవారం పరిశీలించింది. రామాపురం, వెంగళాపురం, శంకరాపురం, ఎర్రపాడు, పీసీ పల్లి, బట్టుపల్లి, గ్రామాల్లో ఉన్న 18 మంది లబ్ధిదారులను డాక్టర్ ఆంజనేయులు, డాక్టర్ సౌజన్య పరిశీలించి వారి నుంచి వివరాలు సేకరించారు. వీరు నిజంగా అర్హులా కాదా.. అర్హులైతే మళ్లీ వీరికి పర్మనెంట్ జీలు ప్రకారం అవసరమైతే సర్టిఫికెట్లు అందజేయున్నట్లు ఎంపీడీవో ప్రభాకర్ శర్మ తెలిపారు.

కేజీబీవీ పాఠశాల తనిఖీ



మాట్లాడుతున్న ఆడిట్ అధికారి రమేష్

వెలిగండ్ల (కనిగిరిరూరల్): వెలిగండ్ల కస్తూరిబా గాంధీ బాలికల విద్యానిలయాన్ని మంగళవారం సోషల్ ఆడిట్ బృంద అధికారులు తనిఖీ చేశారు. ఆడిట్ అధికారి రమేష్ పాఠశాలలోని విద్యార్థులతో మాట్లాడారు. బోధన అభ్యసన ప్రక్రియను పరిశీలించారు. పాఠశాలలోని మౌలిక వసతులు, క్రీడా వస్తువులు, గ్రంథాలయాన్ని, సైన్స్ ల్యాబ్‌ను, విద్యార్థుల హాజరు పట్టికలను పరిశీలించారు. ఈయన వెంట ఎంఈఓల సంఘ జిల్లా అధ్యక్షుడు దేవిరెడ్డి రామిరెడ్డి ఉన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుశీల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సూరీడే.. చందమామైన వేళ !



పామూరు రోడ్డులో లైట్లు వేసుకొని వస్తున్న బస్సు



మంచు దుప్పటి కప్పుకున్న కనిగిరి ఏరియా వ్యూ..



కనిగిరిరూరల్/పామూరు: భానుడు భగభగమనే కనిగిరి ప్రాంతం మంగళవారం మంచు తెరలతో ప్రకృతి హిమపాతంలా మారింది. పొగమంచులో కమ్మేసిన సూరీడు కూడా.. చందమామలాగా మసకబారి కనిపించడంతో కనిగిరి వాసులు తన్మయులయ్యారు. కురిసిన మంచు వర్షానికి కాస్త ఇబ్బంది పడ్డారు. ఉదయం 9 గంటల వరకు సూరీడు మంచుచాటున దాగి ప్రకాశించకుండా దాగుడు మూతలాడాడు. ఉష్ణోగ్రతలు తీవ్రంగా పడిపోవడంతో ఉదయాన్నే పొలంబాట పట్టే కర్షకులు, కార్మికులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు గజగజ వణుకుతూ పరుగులు పెట్టారు. పామూరులో కొండలు, గుట్టలు, పచ్చని చెట్లు, పంట పొలాలు మంచు అందాలతో ప్రకృతి సుందర దృశ్యాలు కనువిందు చేశాయి.



ఉదయం 9.30 వరకు మంచుతో మూసుకుని పోయిన కనిగిరి ప్రధాన రహదారి

పరిసరాల శుభ్రత అందరి బాధ్యత



వార్డులో పర్యటిస్తున్న చైర్మన్ గఫార్

కనిగిరిరూరల్: పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యతని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. పట్టణంలోని 16వ వార్డులో మంగళవారం సమస్య పరిష్కారం కార్యక్రమంలో భాగంగా కౌన్సిలర్ పులి శ్రీనివాసులరెడ్డితో కలిసి పర్యటించారు. స్థానికులు పలు సమస్యలను చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. తక్షణ సమస్య పరిష్కారంగా పారిశుధ్య కార్యక్రమాలు, కాలువల్లో పూడిక తీతలు చేయించారు. అనంతరం చైర్మన్ గఫార్ మాట్లాడుతూ ఇళ్లల్లో నుంచి చెత్త, వ్యర్థాలను రోడ్డుపైన కాలువల్లో వేయకుండా మున్సిపల్ కార్మికులకు అందచేయాలని లేదా, చెత్త రిక్షాలో, ట్రాలీలో వేయాలని సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ పులి విజయలక్ష్మీ శ్రీను, స్థానికులు చిలకపాటి లక్ష్మయ్య, పాలూరి ప్రతాప్‌రెడ్డి, పసన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రాణం పోసే సంజీవని ఎక్కడా ?

- పొన్నలూరులో అందుబాటులో లేని 108 అంబులెన్స్
- ఇబ్బందులు పడుతున్న క్షతగాత్రులు
- పట్టించుకోని వైద్యాధికారులు



పొన్నలూరు పీహెచ్‌సీ ప్రాంగణంలో లేని 108 అంబులెన్స్

పొన్నలూరు: ఎక్కడైనా ప్రమాదాలు జరిగితే చాలు కుయ్.. కుయ్‌మని శబ్దం చేస్తూ 15 నిమిషాల్లో ఆస్పత్రులకు చేర్చి క్షతగాత్రుల ప్రాణాలు కాపాడేవి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం 108కు పెద్దపీట వేసింది. కాని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 108ను పూర్తిగా నిర్వీర్యం చేసింది. రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు క్షతగాత్రులకు సకాలంలో వైద్య అందించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన 108 అంబులెన్స్‌లు అందుబాటులో ఉండటం లేదు. పదేళ్ల కిందట నియోజకవర్గాలకు పరిమితమైన అంబులెన్స్‌లను గత ప్రభుత్వంలో ప్రజల సౌకర్యార్థం మండలానికి ఒకటి చొప్పున కేటాయించారు. అయితే 108 అంబులెన్స్ పైలేట్లు వలన ఇవి సకాలంలో ప్రజలకు చేరువ కావడం లేదు. పొన్నలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి గత ప్రభుత్వంలో అంబులెన్స్ కేటాయించారు. దీనికి సరిపడిన సిబ్బందిని ఏర్పాటు చేసి నిత్యం హాస్పటల్ ప్రాంగణంలో ఉంచి అవసరాన్ని బట్టి ప్రమాదాలు జరిగినప్పుడు ఉపయోగిస్తున్నారు. అయితే ఇంత వరకు బాగానే ఉన్నప్పటికీ ఇటీవల పొన్నలూరు మండలానికి కేటాయించిన అంబులెన్స్ అందుబాటులో ఉండటం లేదు. అవసరం లేకపోయినా సంబంధించిన పైలెట్ (డ్రైవర్) అంబులెన్స్‌ను తీసుకెళ్లి పొట్టిశ్రీరాముల నెల్లూరు జిల్లా కందుకూరు ఏరియా వైద్యశాల దగ్గర ఉంచుతున్నాడు. వాస్తవంగా అవసరాన్ని బట్టి ప్రమాదం జరిగినప్పడు పక్క మండలాలకి సైతం అంబులెన్స్‌ను ఉపయోగించవచ్చు కాని ఏ అవసరం లేకపోయినా దీన్ని తీసుకెళ్లి కందుకూరు ఏరియా వైద్యశాల దగ్గర ఉంచుతున్నాడు. దీంతో మండల పరిధిలో ప్రమాదాలు జరిగినప్పడు సకాలంలో అంబులెన్స్ ప్రమాద స్థలానికి చేరుకోకపోవడం వలన క్షతగాత్రులు వైద్యం కోసం ఇబ్బందులు పడుతున్నారు.

ప్రాణాలు పోతే ఎవరిది బాధ్యత..

ఇటీవల మాలపాడు సమీపంలో పచ్చాకు ట్రాక్టర్లు ఢీకొని ముగ్గురు కూలీలకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ సమయంలో పొన్నలూరు పీహెచ్‌సీ దగ్గర ఉండాల్సిన 108 అంబులెన్స్ అనుమతి లేకుండా కందుకూరు ఏరియా వైద్యశాల దగ్గర ఉండటం, అక్కడ నుంచి ప్రమాదం జరిగిన చోటుకి వెళ్లే సరికి గంటకుపైగా ఆలస్యం అయ్యింది. దీంతో క్షతగాత్రులకు తీవ్ర రక్తస్రావమై వైద్యం అందకా ఇబ్బందులు పడ్డారు. అదే అంబులెన్స్ రూల్స్ ప్రకారం పొన్నలూరు పీహెచ్‌సీ దగ్గర ఉండి ఉంటే గంట ముందే క్షతగాత్రులకు మెరుగైన వైద్యం సమయానికి అందేది. విధుల్లో తన సౌకర్యార్థం పైలెట్ ఎలాంటి అవసరం లేకపోయినా 108 అంబులెన్స్‌ను తీసుకెళ్లి కందుకూరు ఏరియా వైద్యశాల దగ్గర ఉంచుతున్నాడు. దీనిపై పీహెచ్‌సీ వైద్యాధికారులు సైతం స్పందించడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి 108 అంబులెన్స్‌ను మండల ప్రజలకు అందుబాటులో ఉంచాలని కోరుతున్నారు.

దాతల సహకారం అభినందనీయం



స్టడీ మెటీరియల్ అందజేస్తున్న ట్రస్టు సభ్యులు

హనుమంతునిపాడు: విద్యాభివృద్ధికి దాతల సహకారం అభినందనీయమని వక్తలు పేర్కొన్నారు. విద్యాభివృద్ధికి చిట్యాల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ చిట్యాల విజయ భాస్కర్‌రెడ్డి అందిస్తున్న సహకారం అభినందనీయమని ఎంఈఓ జి.పెద్దిరాజు, హెచ్‌ఎంలు బొబ్బరాజు సుబ్బారావు, శ్రీనివాసరాలు అన్నారు. మంగళవారం ట్రస్ట్ ఆధ్వర్యంలో హనుమంతునిపాడులో 79, మహమ్మదాపురంలో 65, వాలిచర్ల 15, పెద్దగొల్లపల్లి పాఠశాల్లో 20 మంది బాలబాలికలకు నియోజక వర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి దద్దాల నారాయణ ఆదేశాల మేరకు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో ఆయన వెంట పార్టీ నాయకులు మండల కన్వీనర్ యక్కంటి శ్రీనివాసలరెడ్డి, మండల రైతు సంఘు అధ్యక్షుడు శ్యామల సాంబిరెడ్డి, యూత్ అధ్యక్షుడు దాసరిపల్లి సర్పంచ్ భవనం కృష్ణారెడ్డి, మండల సర్పంచ్ సంఘు అధ్యక్షులు సానికొమ్ము మధుసూదన్ రెడ్డి ,ఎస్సీ సెల్ అధ్యక్షులు వేశపోగు గురుప్రసాదు, ఎంపీటీసీలు సూరిశెట్టి నారాయణస్వామి, కొడమల బెంజి, సర్పంచ్ కత్తిరాజారావు, పల్లపోలు శ్రీనివాసులరెడ్డి, చిన్న మరియబాబు, ఉప సర్పంచ్, ఏరువ వెంకటరెడ్డి, రుద్రపాటి రాజు, గుంటక రమణారెడ్డి, కోటపాటి మోహన్‌రెడ్డి, మాజీ కోఆప్షన్ సభ్యులు షేక్ మైలాలీ, దేవిరెడ్డి వెంకటస్వామిరెడ్డి, బీసీ నాయకులు కే వెంకట కాశయ్య ,కె.నారాయణ, సానికొమ్ము వెంకటేశ్వరెడ్డి, బంకా నరిసింహులు, మారెళ్ల వెంకటేశ్వరెడ్డి, వి.సుందర్, బి సురేష్ రామయ్య, తిరుపతయ్య ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



పొన్నలూరులో కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్సై అనూక్

పొన్నలూరు: వాహనదారులు నిబంధనలు అతిక్రమించి నడిపితే చర్యలు తప్పవని ఎస్సై కే అనూక్ హెచ్చరించారు. రహదారి భద్రతలో భాగంగా పొన్నలూరులో మంగళవారం ఆటోలు, ట్రాక్టర్లు ఇతర వాహన డ్రైవర్లకు నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పచ్చాకు లోడుతో వెళ్లే ట్రాక్టర్లు సైడ్ డోర్లు తీసి కూలీలను ఎక్కించడం వలన ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. నిబంధనలు పాటించి ప్రమాదాలు జరగకుండా విలువైన ప్రాణాలు కాపాడుకోవాలని సూచించారు. ఆటో డ్రైవర్లు అదనంగా వచ్చే డబ్బుల కోసం ఎక్కువ మందిని ఎక్కించి ప్రమాదాల బారిన పడకుండా పరిమిత సంఖ్యలో ప్రయాణికులను ఎక్కించాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే కేసులు తప్పవన్నారు.

దివ్యాంగుల కోసం ప్రభుత్వాల కృషి



శిబిరానికి వచ్చిన దివ్యాంగులు

సింగరాయకొండ: దివ్యాంగుల అభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని.. వారి కోసం ఉపకరణాలు ఉచితంగా అందజేస్తున్నారని వయోవృద్ధుల సహాయ సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్, జిల్లా మేనేజర్ జీ అర్చన అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం విభిన్న ప్రతిభావంతులకు అవసరమైన ఉపకరణాల మంజూరుకు కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ అలిమ్‌కో ఆధ్వర్యంలో ఏర్పాటైన శిబిరంలో ఆమె పాల్గొన్నారు. యువనేస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో దివ్యాంగులకు భోజన వసతి కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో డీ జయమణి, 350 మంది వయోవృద్ధులు, దివ్యాంగులు, అధికారులు పాల్గొన్నారు.

ప్రమాదాలపై అవగాహన



ఆటో అనౌన్స్మెంట్ ప్రారంభిస్తున్న సీఐ సోమశేఖర్

కొండపి: దొంగతనాలు, రోడ్డు ప్రమాదాలు, సైబర్ నేరాలు, సీసీ కెమెరాలు ఏర్పాటులో పట్ల ప్రజల్లో అవగాహన కల్పించడానికి ఆటోల ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు కొండపి సీఐ సోమశేఖర్, ఎస్సై ప్రేమ్ కుమార్ తెలిపారు. మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి ఆటో అనౌన్స్మెంట్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పోలీసు సహాయంతో ప్రజలలో చైతన్యం కల్పించడం కోసం ఒక వినూత్న కార్యక్రమం శ్రీకారం చుట్టామని అన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి ప్రయాణించాలన్నారు.

సచివాలయ ఉద్యోగులు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

కనిగిరిరూరల్: సచివాలయ సిబ్బంది విధి నిర్వాహణలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. స్థానిక 8వ సచివాలయాన్ని మంగళవారం ఆయన అకస్మిక తనిఖీ చేశారు. సచివాలయంలో సిబ్బంది లేకపోవడం పై, మూమెంట్ రిజిస్టర్‌లను పరిశీలించి, తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. సమయపాలన పాటించిన సిబ్బంది తగు చర్యలుంటాయని హెచ్చరించారు. ప్రజలతో మమేకమై.. ఉన్నత, మెరుగైన సేవలు అందించాలన్నారు.

ట్రాక్టర్ డ్రైవర్లు నిబంధనలు పాటించాలి

వెలిగండ్ల (కనిగిరిరూరల్): పొగాకు ట్రాక్టర్ యజమానులు, డ్రైవర్లు రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలని వెలిగండ్ల ఎస్సై మధుసూదన్ అన్నారు. మంగళవారం పొగాకు, పచ్చాకు ట్రాక్టర్ల యజమానులు, డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ పొగాకు ట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా నడిపినా.. సింగిల్ లైట్‌లతో రాత్రి వేళ ట్రాక్టర్‌నడిపినా చర్యలు తీసుకుంటామన్నారు. తెరచిన డోర్‌లతో రద్దీ రోడ్లపైకి ట్రాఫిక్ సమయంలో వచ్చినా.. టేప్ రికార్డుల పెద్ద శబ్దంతో, సెల్‌ఫోన్‌తో ట్రాక్టర్ నడిపినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ట్రాక్టర్ ట్రాలీలకు విధిగా రేడియం స్టిక్కర్‌లను అతికించాలన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

గీత కార్మికులకు మూడు షాపులు

కనిగిరిరూరల్: కనిగిరి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో గౌడ ఉపకులాలకు (గీత కార్మికులకు) మద్యం షాపులు కేటాయింపు జరిగినట్లు ఎక్సైజ్ సీఐ ఆర్ విజయభాస్కర్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీఎస్‌పురం, పీసీపల్లి, వెలిగండ్ల మండలాల్లో షాపులు కేటాయించారన్నారు. దరఖాస్తు ఫీజు రూ.2 లక్షలు అని, ఇది నాన్ రీఫండ్‌బుల్ అని, ఒక వ్యక్తి ఎన్ని దరఖాస్తులైన చేసుకోవచ్చని వెల్లడించారు. సోమవారం నుంచి ఫిబ్రవరి 5 వరకు దరఖాస్తుల స్వీకరణ, 7న డ్రాలో గెలుపొందిన వారికి అదే రోజు షాపులు కేటాయిస్తారన్నారు.

సింగరాయకొండ: పొన్నలూరు మండలంలో గీతకార్మికుల మద్యం దుకాణానికి దరఖాస్తులను ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానంలో ఆహ్వానిస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ ఎం శివకుమారి తెలిపారు. స్థానిక ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయంలో ఆమె విలేకరుల సమావేశం నిర్వహించారు. పొన్నలూరు మండలలో మద్యం షాపు గౌడ కులస్తుడికి కేటాయించారని, కావున కుల ధ్రువీకరణ పత్రాన్ని కూడా అప్లికేషన్‌తో పాటు జత చేయాలని ఆమె వివరించారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి

టంగుటూరు: పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని తూర్పునాయుడుపాలెం క్లస్టర్ హెచ్‌ఎం సుధారాణి అన్నారు. క్లస్టర్ పర్యవేక్షణలో భాగంగా మంగళవారం మండలంలోని మల్లవరప్పాడు, కారుమంచి పాఠశాలలను మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థుల హాజరు పరిశీలించి, మధ్యాహ్న పథకం గురించి కొత్త మెనూ విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట క్లస్టర్ ఆర్పీ శ్రీనివాసులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నాయకుల మృతి తీరని లోటు

- నివాళులర్పించిన ఇన్‌చార్జి దద్దాల



నారయ్య భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న నారాయణ యాదవ్, పార్టీ నేతలు



రోశయ్య భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న దద్దాల నారాయణ యాదవ్,

కనిగిరిరూరల్: వైఎస్సార్ సీపీ నాయకుల మృతి పార్టీకి తీరని లోటు అని వైఎస్సార్ సీపీ కనిగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ పేర్కొన్నారు. మండలంలోని ఏరువారిపల్లి పంచాయతిలో అనారోగ్యంతో చనిపోయిన వైఎస్సార్ సీపీ నాయకుల భౌతిక కాయాలను మంగళవారం దద్దాల సందర్శించి నివాళులర్పించారు. పంచాయతీలోని గంగపాలెం ఎస్సీ కాలనీలో వైఎస్సార్ సీపీ నాయకుడు జడా నారయ్య (బుడ్డా రామయ్య) గుండెపోటుతో మృతిచెందాడు. నారయ్య భౌతిక కాయాన్ని ఆయన సందర్శించి, పూల మాలలు వేసి నివాళులర్పించారు. నారయ్య కుటుంబానికి రూ.20 వేలను తక్షణ ఆర్థిక సహాయంగా అందచేశారు. అలాగే అజీస్‌పురం గ్రామంలో మృతి చెందిన సత్తినిపల్లి రోశయ్య భౌతిక కాయాన్ని దద్దాల సందర్శించి నివాళులర్పించారు. మృతుని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. నివాళులర్పించిన వారిలో జెడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి, ఆవుల భాస్కర్‌రెడ్డి, సర్పంచ్ దమ్ము వెంకటయ్య, మాజీ ఎంపీటీసీ వీరం రెడ్డి బ్రహ్మారెడ్డి, పార్టీ నాయకులు పల్నాటి భాస్కర్‌రెడ్డి, కటికల వెంకట రత్నం, గాండ్లపర్తి ఆదినారాయణరెడ్డి, గొబ్బిళ్ల శ్రీను, ఆటో జగన్, మేడం కృష్ణారెడ్డి, పగడాల తిరుపాలు, ముప్పూరి తిరుపతయ్య, బిజ్జం శ్రీనివాసులరెడ్డి, కురుకుంట్ల మాలకొండారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వెన్నుపోటులో డాక్టరేట్ చేసిన చంద్రబాబు



కనపర్తి శేషారెడ్డి

సింగరాయకొండ: వెన్నుపోటు రాజకీయాలు చేయటంలో చంద్రబాబుకు డాక్టరేట్ ఇవ్వొచ్చని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు కనపర్తి శేషారెడ్డి ఎద్దేవా చేశారు. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయలేమంటూ చంద్రబాబు బీద పలుకులు పలకడంపై ఆయన స్పందించారు. ఎన్నికలలో సూపర్‌సిక్స్ పథకాలు అంటూ అలవికాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తరువాత అదుగో ఇదుగో అంటూ ప్రజలను ఊరించి చివరికి రాష్ట్రం ఆర్థికంగా అభివృద్ధి చెందినప్పుడే పథకాలు అమలు అంటూ మెలికపెట్టడం చంద్రబాబు వెన్నుపోటు రాజకీయానికి పరాకాష్ట అని విమర్శించారు. 40 సంవత్సరాల ఇండస్ట్రీ అంటూ గొప్పలు చెప్పుకునే బాబుకు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి తెలియదా అని ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వంలో చంద్రబాబు ఆర్థిక పరిస్థితి మెరుగుపడితేనే సంక్షేమ పథకాలు అంటూ సన్నాయి నొక్కులు నొక్కుతున్నాడని ఆరోపించారు. మూడు సిలిండర్ల పథకం కూడా సక్రమంగా అమలు కావటం లేదని సిలిండర్ బుక్ చేసుకున్న లబ్ధిదారుడికి డబ్బులు కూడా జమ కావటం లేదని ఆరోపించారు. ఏరు దాటాక తెప్ప తగలెయ్యటమే చంద్రబాబు నైజమని, ప్రతిసారి బాబు చేతిలో ప్రజలు మోసపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చి మోసం చేసిన చంద్రబాబు ముఖ్యమంత్రి పదవికి అనర్హుడని కావున వెంటనే రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

యాజమాన్య పద్ధతులతో నాణ్యమైన పొగాకు

పొన్నలూరు: పొగాకు రైతులు ఉత్తమ యాజమాన్య పద్ధతులను పాటించి నాణ్యమైన పొగాకు ఉత్పత్తిపై దృష్టి సారించాలని పొగాకు వేలం నిర్వాహణాధికారి కిరణ్ అన్నారు. మండలంలోని వేంపాడు గ్రామంలో మంగళవారం పొగాకు రైతులకు ఆకు రెల్చుట, క్యూరింగ్, గ్రేడింగ్, బేళ్లు కట్టడంపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయంగా పొగాకు ఉత్పత్తిపై రోజు రోజుకూ ఆంక్షలు పెరుగుతున్న నేపథ్యంలో పొగాకును పరిమితంగా సాగు చేయాలన్నారు. అనంతరం రైతులకు తారు బల్లలు, బుట్టలు జిగురు అట్టలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రేడింగ్ అధికారి శివకుమార్, ఐటీసీ మేనేజర్ వెంకటేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

రైతులకు పరిహారం ఇప్పించాలి

సీఎస్‌పురం (పామూరు): గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే (బీకేవీ రోడ్), 167–బీ జాతీయ రహదారి నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు పెండింగ్‌లో ఉన్న పరిహారాన్ని తక్షణం మంజూరు చేసి ఇప్పించాలని ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి కనిగిరి ఆర్డీవో జీకే వర్ధన్‌రెడ్డికి సూచించారు. మండల కేంద్రం సీఎస్‌పురం సమీపంలో నిర్మాణంలో ఉన్న గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే పనులను మంగళవారం ఎమ్మెల్యే, ఆర్డీఓ కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సిబ్బందితో సమావేశమైన ఆయన భూములు కోల్పోయిన రైతులతో చర్చించి రికార్డులను సరిచేసి పరిహారం వచ్చేలా చూడాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ పొన్నరుసు వెంకటేశ్వర్లు, సింగిల్‌విండో మాజీ చైర్మన్ బీ నారాయణరెడ్డి, రైతులు పాల్గొన్నారు.